ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5

పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

బుధవారం 14 ఆగస్టు 2024



రెవెన్యూ సదస్సులు వాయిదా

పార్వతీపురం, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): ప్రజల భూ సమస్యలను పరిష్కరించేందుకు ఈనెల 16 నుంచి జిల్లాలో జరగాల్సిన రెవెన్యూ సదస్సులు వాయిదా పడ్డాయి. వాస్తవంగా ఈనెల 15న లాంఛనంగా ప్రారంభించి 16 నుంచి సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ అనివార్య కారణాలతో సెప్టెంబరు వరకు సదస్సులు వాయిదా పడ్డాయి. దీనిపై ఇన్‌చార్జి డీఆర్వో కేశనాయుడును వివరణ కోరగా.. రెవెన్యూ సదస్సులు వాయిదా పడిన విషయం వాస్తవమేనని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తదుపరి తేదీని ప్రకటిస్తామని చెప్పారు.

ఆ పంచాయతీ కనిపించట్లే!





నిమ్మలపాడు పంచాయతీ

- రెండు మండలాల రికార్డుల్లో లేని నిర్వాసిత గ్రామం
- గత వైసీపీ సర్కారు హయాంలో జరిగిన తప్పిదం
- ఆన్‌లైన్‌లోనూ కానరాని నిమ్మలపాడు
- ఏమీ చెప్పలేకపోతున్న అధికారులు
- కొత్తగా పథకాలు, పింఛన్లు పొందలేకపోతున్న గ్రామస్థులు
- కూటమి ప్రభుత్వం స్పందించాలని విన్నపం

(జియ్యమ్మవలస)

నిమ్మలపాడు పంచాయతీ.. ఇదొక నిర్వాసిత గ్రామం.. కొమరాడ, జియ్యమ్మవలస మండలాల రికార్డుల్లో మాత్రం ఆ పేరు కనిపించడం లేదు. దీనిపై అధికారులు కూడా ఏమీ చెప్పలేకపోతున్నారు. గత వైసీపీ సర్కారు నిర్లక్ష్యంతో కొన్నాళ్లుగా ఆ ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా సంక్షేమ పథకాలు, పింఛన్లు తదితర వాటిని పొందలేకపోతున్నారు. ఆన్‌లైన్‌లో నమోదుకు కూడా అవకాశం లేకపోవడంతో ఆ పంచాయతీ వాసులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికైనా తమ పంచాయతీ ఏ మండల పరిధిలో ఉందో చెప్పాలంటూ వారు డిమాండ్ చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

నిమ్మలపాడు పంచాయతీ తోటపల్లి బ్యారేజీ ముంపు ప్రాంతంలో ఉండేది. కొమరాడ మండలంలోని 31 పంచాయతీల్లో తోటపల్లి బ్యారేజీ నదీ పరివాహక ప్రాంత తూర్పు తీరంలో ఇదొకటి. ఈ పంచాయతీని 2004-05 ఆర్థిక సంవత్సరంలో నిర్వాసిత పంచాయతీగా ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు జియ్యమ్మవలస మండలం బిత్రపాడు, బట్లభద్ర గ్రామాల్లో ఆ పంచాయతీ వాసులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ప్యాకేజీని అందించారు. దీంతో వారు అక్కడే ఇళ్లు నిర్మించుకొని జీవిస్తూ వస్తున్నారు. 2004-05 నుంచి 2021-22 ఆర్థిక సంవత్సరం వరకు ఈ పంచాయతీ కొమరాడ మండలంలోనే కొనసాగింది. ఇక్కడ మొత్తం 500 కుటుంబాలు ఉన్నాయి. కొమరాడ మండలం దళాయిపేట సచివాలయంలో 2022 వరకు కొనసాగుతూ వచ్చింది. కానీ ఆ తర్వాత సీన్ మారింది. కొమరాడ మండలంలో ఉన్న వారిని జియ్యమ్మవలస మండలంలోకి తేవాలని గత ప్రభుత్వ హయాంలో ప్రయత్నాలు జరిగాయి. అయితే చివరకు ఆ రెండు మండలాల్లో ఆ పంచాయతీ పేరు కనిపించడం లేదు. దీంతో తాము ఎక్కడున్నామో తేల్చాలని ఆ ప్రాంతవాసులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం స్పందించాలని వారు కోరుతున్నారు.

ఇవీ సమస్యలు..

- ఈ పంచాయతీలో ఉన్న అర్హులకు కొమరాడ మండలం దళాయిపేట సచివాలయం నుంచే సంక్షేమ ఫలాలన్నీ అందుతున్నాయి. కానీ పంచాయతీ నిర్వహణ, అభివృద్ధి పనులు మాత్రం జియ్యమ్మవలస మండలం బిత్రపాడు పంచాయతీ నుంచి జరుగుతున్నాయి. కానీ రావల్సిన నిధులు మాత్రం నాలుగేళ్లుగా కొమరాడ మండలంలోని దళాయిపేట సచివాలయానికి జమ అవుతూ వస్తోంది. ఈ నిధులు బిత్రపాడు సచివాలయానికి జమ చేయాలని గతంలో ఎంపీడీవో, డీపీవో, కమిషనర్‌కు గ్రామ సర్పంచ్ లేఖలు రాసినా ప్రయోజనం లేకపోయింది.
- రెండున్నరేళ్ల కిందట జరిగిన సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుల ఎన్నికలకు, ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలకు వీరు జియ్యమ్మవలస మండలం బిత్రపాడు పంచాయతీలోని వారు ఓట్లు వేశారు.
- ఈ పంచాయతీ ప్రజల ఆధార్, రేషన్‌కార్డులు కొమరాడ మండలం పేరుతో ఉన్నాయి. అయితే జియ్యమ్మవలస మండలం బిత్రపాడు పంచాయతీ పరిధిలో ఉన్న వారికి హౌస్ హోల్డ్ మ్యాపింగ్ అవడం లేదు. ఫలితంగా కొత్త పింఛన్లు, ఇతరత్రా సంక్షేమ పథకాలకు ఆన్‌లైన్ చేయాలంటే రెండు మండలాల్లోనూ కుదరడం లేదు.



సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్న గ్రామస్థులు

న్యాయం చేయాలి..



మా పంచాయతీకి అతీగతీ లేకుండాపోయింది. కొమరాడ మండలంలో మా పంచాయతీని తొలగించేశారని చెబుతున్నారు. జియ్యమ్మవలస మండలంలో అసలు లేదంటున్నారు. మాకు పూర్తి న్యాయం చేయాలి.

-వాకాడ గౌరునాయుడు, మాజీ సర్పంచ్, నిమ్మలపాడు పంచాయతీ

తొలగించేశారు..



నిమ్మలపాడు పంచాయతీ కొమరాడ మండలం నుంచి తొలగించేశారు. ఏదైనా వివరాలు కావాలంటే డీపీవోతో మాట్లాడుకోండి. ఎలా జరిగిందో నాకు తెలియదు.

-ఎం.మల్లికార్జునరావు, ఎంపీడీవో, కొమరాడ మండలం

రెండు మండలాల్లో లేదు..



నిమ్మలపాడు పంచాయతీ అనేది కొమరాడ, జియ్యమ్మవలస మండలాల్లో కనిపించడం లేదు. కానీ పంచాయతీ అభివృద్ధి పనులన్నీ బిత్రపాడు సచివాలయం నుంచే చేస్తున్నాం. నిధులు మాత్రం నాలుగేళ్లుగా దళాయిపేట సచివాలయంలో జమవుతున్నాయి.

-పి.శ్రీనివాసరావు, ఎంపీడీవో, జియ్యమ్మవలస మండలం

ఉపాధి కూలీలకు ఊరట

- వారి వేతన బకాయిలు విడుదల
- వ్యక్తిగత ఖాతాల్లో జమ

మెంటాడ, ఆగస్టు 13: ఉమ్మడి జిల్లాలో వేలాది మంది ఉపాధి హామీ పథకం కూలీలకు గత వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన సుమారు రూ.1.15 కోట్ల వేతన బకాయిలను కూటమి ప్రభుత్వం విడుదల చేసింది. మంగళవారం కూలీల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమయ్యాయి. దీంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు వరకు ఉపాధి పనులు చేపట్టిన అప్పటి ప్రభుత్వం కూలీలకు చెల్లింపుల విషయంలో మీనమేషాలు లెక్కించింది. ఒక్కొక్కరికీ ఐదారు వారాలకు సంబంధించి ఆరేడువేల రూపాయలు చొప్పున చెల్లింపులు నిలిచిపోయాయి. దీంతో వారు చాలా ఇబ్బందులు పడ్డారు. ఏరోజుకారోజు ఎదురుచూస్తూ నిరాశకు గురయ్యారు. ఈ వేతన వెతలపై గతనెల 25న 'వేతనాలో రామచంద్రా' శీర్షికన ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా ఇటువంటి పరిస్థితులు సీఎం చంద్రబాబు దృష్టికి వెళ్లిన క్రమంలో ఆయన జిల్లాలవారీగా వేతన బకాయిల వివరాల కోసం ఆదేశించారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాకు సంబంధించి కూలీల బకాయిలు రూ.1.15 కోట్లు విడుదల చేశారు. దీనిపై డ్వామా పీడీ ఉమాపరమేశ్వరిని వివరణ కోరగా.. ఉపాధి వేతన బకాయిల నిధులు విడుదలయ్యాయని, రెండు రోజులుగా కూలీల వ్యక్తిగత ఖాతాల్లో జమవుతున్నాయని తెపాఆరు.



సగంలోనే..!

- నిలిచిన వంతెన నిర్మాణం
- పట్టించుకోని గత వైసీపీ సర్కారు
- గిరిజనులకు తప్పని ఇబ్బందులు
- గెడ్డ ఉప్పొంగితే.. రాకపోకలు బంద్
- నూతన ప్రభుత్వం స్పందించాలని విన్నపం



వెంపలగూడ వంతెన నిర్మాణం ఇలా..

సీతంపేట రూరల్, ఆగస్టు13 : సీతంపేట ఏజెన్సీలో వంతెన, రహదారి నిర్మాణాలకు మోక్షం లభించడం లేదు. ఏళ్లు గడుస్తున్నా.. పనులు పూర్తవకపోవడంతో గిరిజనులకు రవాణా కష్టాలు తీరడం లేదు. తితలీ తుఫాన్ సమయంలో పులిపుట్టి పంచాయతీ పరిధి వెంపలగూడ నుంచి పాత రేగులగూడ, రేగులగూడ గ్రామాలకు వెళ్లే మార్గంలోని వంతెన కొట్టుకుపోయింది. దీంతో అప్పటి నుంచి ఆయా గ్రామాల రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. వర్షాకాలంతో గిరిజనులు గెడ్డను దాటుకుంటూ ఇళ్లకు చేరుకోవాల్సి వస్తోంది. ఈ సమస్యను గుర్తించిన అప్పటి టీడీపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నుంచి నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు వెంపలగూడ - రేగుమానుగూడ వరకు 3.5 కిలోమీటర్ల మేర బీటీ రహదారితో పాటు వంతెన నిర్మాణానికి గాను రూ.2.40 లక్షలు కేటాయించారు. అయితే దీనికి ఆర్‌అండ్‌బీ శాఖ ప్లాన్ ఇవ్వగా, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో పనులు ప్రారంభమయ్యాయి. రహదారి, వంతెన పనులు కొంత వరకు పూర్తయ్యాయి. ఇంతలో ఎన్నికలు జరగడం.. వైసీపీ అధికారంలోకి రావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా గత ఐదేళ్లలో నిర్మాణం పూర్తికాలేదు. రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా వెట్ మిక్స్ వేసి వదిలేశారు. వంతెనకు సంబంధించి పిల్లర్సు మాత్రమే వేశారు. శ్లాబు పనులు పూర్తి చేయలేదు. దీంతో ఈ ప్రాంతంలో గిరిజనులకు ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామాలకు రాకపోకలు సాగించాలంటే.. వారు గెడ్డ దాటాల్సి వస్తోంది. వర్షాకాలంలో గెడ్డ ఉప్పొంగి ప్రవహించడంతో ఆయా గ్రామస్థులకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. అత్యవసర వైద్య సేవల కోసం చుట్టూ తిరిగి ఇప్పగూడ మీదుగా సీతంపేటకు చేరుకోవాల్సి వస్తోందని గిరిజనులు వాపోతున్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి.. వెంపలగూడ రహదారి, వంతెన నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

టీడబ్ల్యూ ఈఈ ఏమన్నారంటే..

'తితలీ తుఫాన్ సమయంలో వెంపలగూడ వంతెన కూలిపోయింది. దీంతో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరు చేయగా.. సగం పనులు పూర్తిచేశాం. వంతెన నిర్మాణం శ్లాబు స్థాయిలో ఉంది. సంబంధిత కాంట్రాక్టర్‌కు రూ.65 లక్షల వరకు బిల్లు చెల్లించాల్సి ఉంది. రహదారితో పాటు వంతెన నిర్మాణానికి అప్పటి టీడీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే ఆ నిధులు చాలని కారణంగా అదనంగా మరో రూ.1.5 కోట్లు మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. వర్క్‌కు సంబంధించి ప్రొవిజన్ పెట్టాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉంది. త్వరలోనే ఈ పనులను పూర్తి చేస్తాం' అని గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈ సింహాచలం తెలిపారు.



గెడ్డ దాటుతున్న గిరిజనులు

20 నుంచి ఓటరు జాబితా సవరణ

- షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల సంఘం



కొమరాడ, ఆగస్టు 13 : ఓటర్ల జాబితా సవరణకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను కూడా ప్రకటించింది. ఈ మేరకు బీఎల్‌వోలు ఈ నెల 20 నుంచి ఇంటింటికీ వెళ్లి పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పు, తప్పులు సవరణ వంటి కార్యక్రమాలు చేపడతారు. అక్టోబరు 18వ తేదీ నాటికి ఆయా పనులన్నీ పూర్తి చేయాల్సి ఉంది. ఒకే చిరునామాపై ఎక్కువ ఓట్లు, జీరో ఇంటి నెంబర్లతో ఉన్న వాటిపై అధి కారులు ప్రత్యేక దృష్టి సారించనున్నారు. అక్టోబరు 29వ తేదీన ముసా యిదా జాబితాను ప్రకటిస్తారు. దీనిపై సవరణలు, అభ్యంతరాలను నవంబరు 28 వరకు స్వీకరిస్తారు. డిసెంబరు 24లోపు పరిష్కరించి.. జనవరి 6న తుది జాబితా ప్రచురిస్తారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో 1,500 మంది ఓటర్లు మించకుండా.. అవసరమైన చోట రేషనలైజేషన్ చేసేలా ఈసీ మార్గదర్శకాలు జారీ చేసింది.

జిల్లాకేంద్రంలో జెండా ఆవిష్కరించనున్న మంత్రి

పార్వతీపురం, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రం పార్వతీపురంలో నిర్వహించనున్న పంద్రాగస్టు వేడుకల్లో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాల్గొనున్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించిన తర్వాత ఉత్తమ సేవలను అందించిన ఉద్యోగులు, అధికారులకు ప్రశంసాపత్రాలను అందించనున్నారు. దీనికి సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డి, జేసీ శోభిక తదితరులు పాల్గొనున్నారు.

17 మంది ఎంపీడీవోల రాక

గరుగుబిల్లి, ఆగస్టు 13 : సార్వత్రిక ఎన్నికల సమయంలో శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయిన 17 మంది ఎంపీడీవోలను తిరిగి పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలకు కేటాయిస్తూ శ్రీకాకుళం జడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే శ్రీకాకుళం జిల్లాకు చెందిన 16 మంది ఎంపీడీవోలను విజయనగరం జడ్పీ సీఈవో శ్రీకాకుళం జిల్లాకు కేటాయించారు. కాగా ఉమ్మడి జిల్లాకు చెందిన ఎం.రత్నం, డీడీ స్వరూపరాణి, బి.కల్యాణి, వై.పద్మజ, జి.గిరిబాల, కె.సాల్మన్ రాజు, సీహెచ్ సూర్యనారాయణ, వైవీ రాజేంద్రప్రసాద్, కె.రామకృష్ణరాజు, సుబ్రహ్మణ్యం, కె.కిషోర్‌కుమార్, జి.భాస్కరరావు, ఎం.సతీష్, పి.త్రివిక్రమ రావు, ఎస్.రామకృష్ణ, కె.విజయలక్ష్మి, జి.పైడితల్లిలను గతంలో విధులు నిర్వహించిన మండలాలకు కేటాయించారు.

జెండా మురిసేలా.. విశిష్టత తెలిసేలా..



- పల్లెల్లో పంద్రాగస్టు వేడుకలకు నిధుల పెంపు
- ఆదేశాలు జారీ చేసిన కూటమి ప్రభుత్వం
- సర్వత్రా హర్షాతిరేకాలు

కొమరాడ, ఆగస్టు13: గ్రామాల్లో పంద్రాగస్టు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు కూటమి సర్కారు భారీగా నిధులు కేటాయించింది. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాలు జారీ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ విశిష్టతను తెలిసేలా వేడుకలు నిర్వహించాలని సూచించారు. దీంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవు తున్నాయి. మరోవైపు జిల్లాలో పల్లెలన్నీ స్వాతంత్ర్య దినోత్సవానికి ముస్తాబవుతున్నాయి.

గతంలో ఇలా..

గత వైసీపీ ప్రభుత్వం ఏనాడూ పంచాయతీలకు ఈ స్థాయిలో నిధులు కేటాయించలేదు. పంద్రాగస్టు వేడుకలకు చిన్న పంచాయతీలకు రూ.150, మేజర్ పంచాయతీలకు రూ.250 చొప్పున కేటాయించేవారు. ఈ మొత్తం కనీసం చాక్లెట్లు కొనడానికి కూడా సరిపోయేవి కాదు. దీంతో భారం అంతా సర్పంచ్‌లపై పడేది. దీంతో సొంత నిధులతో వేడుకలు నిర్వహించి దేశభక్తిని చాటుకునేవారు.



స్పందించిన కూటమి సర్కారు

ఇటీవల సర్పంచ్‌లు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కలిసి.. పంచాయతీల ఆర్థిక దుస్థితిని వివరించారు. దీనిపై స్పందించిన ఆయన 2011 జనాభా లెక్కల ఆధారంగా నిధులు ఇస్తామని ప్రకటించారు. ఈసారి పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఊహించని స్థాయిలో నిధులు కేటాయించారు. ఈ మేరకు 5 వేలలోపు జనాభా ఉంటే రూ. 10 వేలు, 5 వేలు కంటే ఎక్కువ జనాభా ఉంటే రూ. 25 వేలు వరకు అందనుంది. జిల్లాలో 15 మండలాల్లో 451 గ్రామ పంచాయతీలకు ఈ నిధులు రానున్నాయి.

వేడుకల నిర్వహణ ఇలా..

పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఆగస్టు 15 విశిష్టత , రాజ్యాంగ విలువలు, స్థానిక సంస్థల పాలన వంటి అంశాలపై వక్తృత్వ, క్విజ్, వ్యాస రచన, క్రీడా పోటీలు నిర్వహించి ప్రోత్సహించాల్సి ఉంది. వీటిల్లో ఆయా పాఠశాల ఉపాధ్యాయులను భాగస్వాములను చేయాల్సి ఉంది. విజేతలకు బహుమతులు అందజేయాలి. మిఠాయిలు, చాక్లెట్లు పంచిపెట్టాలి. స్వాతంత్ర్య సమరయోధులు, దేశ రక్షణకు పాటుపడిన వారిని, పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించాలి. పారిశుధ్యం గురించి మహాత్మా గాంధీజీ చెప్పిన మాటలతో ప్రమాణం చేయించాలి.

ప్రత్యేకంగా నిర్వహించేందుకు...

స్వాతంత్ర్య దినోత్సవాన్ని ప్రత్యేకంగా నిర్వహించేందుకు జిల్లాలో పంచాయతీలన్నీ ముందుకు రావాలి. వేడుకలకు అవసరమైన నిధులను ప్రభుత్వం భారీగా పెంచినందున ఎక్కడా రాజీ పడవద్దు. పంద్రాగస్టు విశిష్టత తెలిపేలా ఘనంగా కార్యక్రమాలు నిర్వహించాలి. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలి.

- బి.సత్యనారాయణ, డీపీవో, పార్వతీపురం మన్యం

ఎంతో సంతోషంగా ఉంది

స్వాతంత్ర్య వేడుకలకు కూటమి ప్రభుత్వం నిధులు పెంచడం ఎంతో సంతోషంగా ఉంది. ఘనంగా వేడుకలు నిర్వహిస్తాం. గతంలో అందుబాటులో ఉన్న నిధులతో నిర్వహించుకునే వాళ్లం. ప్రస్తుతం ప్రత్యేక నిధులతో ఎంతో ఊరట కలగనుంది.

-హెచ్.గంగారావు, సర్పంచ్, చినఖేర్జిల, కొమరాడ మండలం



నవ్య | చిత్రజ్యోతి
విజయనగరం • బుధవారం • 14 ఆగస్టు 2024
cinema@andhrajyothy.com

షారూఖ్‌ను దాటిన పాపులారిటీ



ఎంటర్‌టైన్‌మెంట్ పోర్టల్ ఐఎండీబీ తాజాగా విడుదల చేసిన ఈ వారం అత్యంత ప్రజాదరణ పొందిన భారతీయ సెలబ్రిటీ జాబితాలో హీరోయిన్ శోభితా దూళిపాళ్ల పలువురు అగ్ర తారలను వెనక్కునెట్టి, రెండో స్థానం దక్కించుకున్నారు. షారూఖ్‌ఖాన్ ఆమె తర్వాతి స్థానంలో నిలిచారు. శార్వరీ అగ్రస్థానంలో నిలవగా, జాన్వీకపూర్ ఐదో స్థానంలో నిలిచారు. ఇటీవలే నాగచైతన్యతో శోభిత నిశ్చితార్థం జరిగిన నేపథ్యంలో నెటిజన్లు ఆమె గురించి తెలుసుకునేందుకు ఎక్కువగా సెర్చ్ చేశారు.

'మిస్టర్ బచ్చన్'ను గుర్తుంచుకుంటారు



రవితేజ, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రం 'మిస్టర్ బచ్చన్'. హరీశ్ శంకర్ దర్శకత్వంలో టీ.జీ.విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ గురువారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవితేజ మాట్లాడుతూ "ఈ సినిమాలో మీరు కొత్త రవితేజను చూస్తారు. ఇందులోని ప్రేమకథ, పాటలు, యాక్షన్ ఎపిసోడ్స్ అద్భుతంగా వచ్చాయి. ఈ సినిమా థియేటర్లలో ఇరగదీస్తుంది. ప్రేక్షకులు చాలా కాలం గుర్తుంచుకుంటారు" అని చెప్పారు. "ఈ సినిమా అందరికీ నచ్చేలా ఉంటుంది. ఇది థియేటర్లలో ప్రేక్షకులతో విజిల్స్ వేయించే సినిమా. అనుకున్నదానికంటే బాగా వచ్చింది. దానిక్కారణం అయనంక బోస్ విజువల్స్, మిక్కీ.జే.మేయర్ సంగీతం. ఈ సినిమాకు రిపీట్ ఆడియెన్స్ ఉంటారు" అని దర్శకుడు హరీశ్ శంకర్ అన్నారు. "ఇది రవితేజతో నా మూడో సినిమా. ఈ సినిమాలో ప్రేక్షకులని ఆశ్చర్యపరిచే అంశాలు చాలా ఉన్నాయి. ఈ మాస్ ఎంటర్టైనర్ అందరికీ నచ్చుతుంది" అని నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ తెలిపారు.



తిరుమలేశుడి సేవలో జాన్వీకపూర్

ప్రముఖ నటి శ్రీదేవి కుమార్తె, బాలీవుడ్ యాక్టర్ జాన్వీ కపూర్ మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సోమవారం రాత్రి కాలినడకన తిరుమలకు చేరుకున్న ఆమె తన స్నేహితుడు శిఖర్ పహారియాతో కలిసి మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయక మండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వచనం చేశారు. శ్రీదేవి జీవించి ఉండగా ఏటా తన పుట్టిన రోజు నాడు తిరుమల శ్రీవారిని దర్శించుకొని ఆశీస్సులు పొందేవారు. జాన్వీకపూర్ ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.

తిరుమల, (ఆంధ్రజ్యోతి)



సక్సెస్‌ను సెలబ్రేట్ చేద్దాం

నాని కథానాయకుడిగా వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహించిన చిత్రం 'సరిపోదా శనివారం'. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రబృందం మంగళవారం హైదరాబాద్‌లో ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ "సరిపోదా... చిత్రంతో ప్రేక్షకులకు మంచి సినిమా చూసిన అనుభూతి కలుగుతుంది. మన సినిమా సక్సెస్‌ను థియేటర్లలో సెలబ్రేట్ చేద్దాం' అన్నారు. ఎస్. జే సూర్య మాట్లాడుతూ 'నాని గారి పాత్ర ఈ సినిమాలో ప్రతి శనివారం చేసే పనులు 'బాషా' చిత్రాన్ని గుర్తుకు తెస్తాయి' అన్నారు. సినిమా బ్లాక్‌బస్టర్ అవుతుందని డీవీవీ దానయ్య చెప్పారు.


గురుదక్షిణగా రూ. 300



ఖరీదైన బహుమతులే అవ్వాల్సిన పనిలేదు... మనసు అంతరాళలో నుంచి పొంగిపొర్లే ప్రేమను వ్యక్త పరిచేందుకు ఇచ్చే బహుమతులు చిన్నవే అయినా వాటి విలువ అమూల్యమే. సీనియర్ బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ తను గురువుగా భావించే మహేశ్‌భట్‌కు కూడా ఇలాంటి బహుమతినే అందించి, ఆశ్చర్యపరిచారు. ఇటీవలే ముంబైలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో మహేశ్‌భట్, అనుపమ్‌ఖేర్ వేదికను పంచుకున్నారు. తన సినీ ప్రయాణం గురించి వేదికపైన మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు అనుపమ్‌ఖేర్. 'ఎవరైనా నా బయోపిక్ తీస్తే అందులో భట్ సాబ్‌ది ముఖ్యమైన పాత్ర అవుతుంద'ని ఆయన అన్నారు. అలా చెబుతూ వెంటనే తన జేబులో నుంచి రూ. 300 తీసి మహేశ్‌భట్‌కు అందజేసి, గురుదక్షిణగా స్వీకరించాలని కోరారు. మహేశ్‌భట్ ఆ నోట్లను సంతోషంగా స్వీకరించడమే గాకుండా వాటిని వేదికపైనుంచి అందరికీ చూపించి, జాగ్రత్తగా తన జేబులో దాచుకున్నారు. అనుపమ్‌ఖేర్ సినీ జీవితాన్ని మలుపుతిప్పిన చిత్రం 'సారాంశ్'. నటుడిగా ఆయనకు గొప్ప పేరు తెచ్చి కెరీర్‌లో నిలదొక్కుకునేలా చేసింది. 1984లో వచ్చిన ఈ చిత్రానికి మహేశ్‌భట్ దర్శకత్వం వహించారు.

సవాలుతో కూడుకున్న విషయం

తెలుగులోనూ మంచి పాపులారిటీ ఉన్న తమిళ సంగీత దర్శకుల్లో జి.వి.ప్రకాశ్ ఒకరు. ఆయన సంగీతం అందించిన లేటెస్ట్ చిత్రం 'తంగలాన్'. ఈ గురువారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు. "ఇలాంటి పీరియాడికల్ ఫిల్మ్‌కు సంగీతం అందించడం చాలా సవాలుతో కూడుకున్న విషయం. ఇలాంటి నేపథ్యం ఉన్న సినిమాలకు పనిచేసే అవకాశం అరుదుగా వస్తుంటుంది. అందుకే ఈ చాన్స్ మిస్ చేసుకోవాలనుకోలేదు. ఒక సంగీత దర్శకుడిగా ఈ సినిమాకు పనిచేయడం ఎంతో సంతృప్తినిచ్చింది. ఈ సినిమాకు ఎలాంటి సంగీతం అందించాలనే విషయమై చాలా పరిశోధన చేశాను. దర్శకుడు పా.రంజిత్ విజన్ చాలా బాగుంటుంది. థియేటర్లలో పూనకాలు తెప్పించే సన్నివేశాలు సినిమాలో చాలా ఉన్నాయి. ఇప్పటికే రిలీజైన పాటలకి మంచి స్పందన వస్తోంది" అని చెప్పారు.



కొత్తగా...

ధైర్యాన్ని నింపింది



నటుడిగా తొలి చిత్రం 'అలనాటి రామచంద్రుడు' చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు కృష్ణవంశీ. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం మంచి టాక్‌తో నడుస్తోంది. ఈ సందర్భంగా కృష్ణవంశీ మీడియాతో ముచ్చటించారు. "నా తొలి సినిమాకే ఇంతటి ప్రేక్షకాదరణ దక్కడం చాలా సంతోషంగా ఉంది. చాలా రోజుల తర్వాత ఓ స్వచ్ఛమైన ప్రేమకథను థియేటర్లలో చూశామని ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు. ఈ విజయం టీమ్ అందరిలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది" అని చెప్పారు.

ఐదు జంటల ప్రేమకథ



ఎం.ఎస్.వి సాగర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'కాలం రాసిన కథలు'. ఈనెల 29న విడుదలవుతోంది. హీరో ఆకాశ్ జగన్నాథ్ ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఐదు ప్రేమ జంటల మధ్య సాగే అద్భుతమైన కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని దర్శకుడు చెప్పారు. శృతి శంకర్, విహారిక, అభిలాష్ కీలకపాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: అరమాన్. సినిమాటోగ్రఫీ: ఎస్. ప్రసాద్.

డేట్ మార్చడమే 'స్త్రీ 2'కి కలిసొచ్చిందా?

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ గురువారం రెండు హిందీ చిత్రాలు విడుదలవుతున్నాయి. అవేమిటంటే.. అక్షయ్‌కుమార్ నటించిన 'ఖేల్ ఖేల్ మే', జాన్ అబ్రహం ప్రధాన పాత్ర పోషించిన 'వేదా'. వీటి కంటే ఒక రోజు ముందే రాజ్‌కుమార్ రావు, శ్రద్ధా కపూర్ నటించిన 'స్త్రీ 2' రిలీజ్ అవుతోంది. ఈ మూడు చిత్రాల్లో మొదటి నుంచీ 'స్త్రీ 2' చిత్రం మీద ఎవరికీ అంచనాలు లేవు. దీనికి ప్రధాన కారణం హీరోయిన్ శ్రద్ధా కపూర్‌కు నాలుగేళ్లుగా సరైన హిట్ లేకపోవడం. అలాగే హీరో రాజ్‌కుమార్ రావుకు ఈ ఏడాది విడుదలవుతున్న మూడో సినిమా ఇది. అతనికి కూడా ఓహో అనిపించే హిట్ పడకపోవడం మరో కారణం. రాజ్‌కుమార్ రావు, శ్రద్ధా కపూర్ నటించిన 'స్త్రీ' చిత్రం 2018లో విడుదలై సూపర్ హిట్ అయింది. అప్పట్లోనే ఈ హారర్ కామెడీ రూ వంద కోట్లు వసూలు చేసింది. సాధారణంగా సీక్వెల్ అనగానే భారీ అంచనాలు ఉండడం సహజం. కానీ 'స్త్రీ' సీక్వెల్‌కు అంత క్రేజ్ రాకపోవడం గమనార్హం. మొదట ఈ సినిమాను కూడా గురువారమే విడుదల చేయాలనుకున్నారు. అప్పటికే రెండు భారీ చిత్రాలు పోటీలో ఉండడంతో భారీ ఓపెనింగ్స్ వస్తే గొప్పే అని అనుకున్నారు .కానీ అనూహ్యంగా గురువారం కు బదులు బుధవారమే సినిమాను విడుదల చేయాలని చివరి క్షణంలో నిర్ణయం తీసుకోవడం "స్త్రీ 2' కు కలసి వచ్చిందని ట్రేడ్ పండితులు అంటున్నారు. సోలో రిలీజ్ కావడంతో మొదటి రోజే రూ పది కోట్లకు పైగా కలెక్ట్ చేస్తుందని ఓ అంచనా.



టికెట్ల అడ్వాన్స్ బుకింగ్ జోరు చూస్తుంటే అంత మొత్తం వసూలు చేయడం ఈజీయే అని ట్రేడ్ పండితులు పేర్కొంటున్నారు. చిన్న చిత్రాల్లో 'గదర్ 2' చిత్రానిదే ఇప్పటివరకూ రికార్డ్. ఆ సినిమా తొలి వారం రూ 40.10 కోట్లు వసూలు చేసింది. ఇప్పుడున్న అడ్వాన్స్ బుకింగ్ ట్రెండ్‌ను పరిశీలిస్తే 'స్త్రీ 2' దానిని అధిగమించి, రూ 50 కోట్లు వసూలు చేసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఇప్పటివరకూ 'స్త్రీ 2' చిత్రానికి సంబంధించి 2.21 లక్షల టికెట్లు అడ్వాన్స్‌గా బుక్ అయ్యాయి. దీని వల్ల రూ. 6.87 కోట్లు వసూలు అయ్యాయి. మహారాష్ట్ర, ఢిల్లీ సర్క్యూట్స్ లోనే అత్యధిక టికెట్లు అమ్ముడవడం విశేషం. ఓపెనింగ్ రోజు థియేటర్ల దగ్గర అమ్మకాలు ఉంటాయి కనుక రూ పది కోట్లు వసూలు చయడం పెద్ద కష్టమేమీ కాదని చెబుతున్నారు. అదే నిజమై 'స్త్రీ 2' తొలి వారం రూ 50 కోట్లు వసూలు చేస్తే హారర్ కామెడీ చిత్రాల్లో ఇదే హయ్యెస్ట్ రికార్డ్ అవుతుంది. ఈ అంకెలు ఎంతవరకూ నిజమవుతాయో కొన్ని గంటల్లో తేలిపోతుంది కనుక వేచి చూద్దాం.

ఆంధ్ర వర్సిటీలో ఎంబీఏ, ఎంసీఏ



విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్(ఏయూడీఓఏ)- ఎంబీఏ, ఎంసీఏ ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లలో సెల్ఫ్ సపోర్ట్ మోడ్ కేటగిరీ సీట్ల భర్తీకి దరఖాస్తు గడువు పొడిగించింది. ఏపీఐసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారు. సీట్లు మిగిలిన పక్షంలో అకడమిక్ ప్రతిభ ఆధారంగా అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ట్యూషన్ ఫీ రీయింబర్స్‌మెంట్ వర్తించదు. స్కాలర్‌షిప్‌లు లభించవు.

ఎంబీఏ: ఎంబీఏ జనరల్ ప్రోగ్రామ్‌తోపాటు మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్స్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, హెచ్ ఆర్ స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. హెచ్‌ఆర్ స్పెషలైజేషన్‌లో 66 సీట్లు; మిగిలిన వాటిలో ఒక్కోదానిలో 44 సీట్లు ఉన్నాయి. ఎంబీఏ(జనరల్, హెచ్‌ఆర్) ప్రోగ్రామ్‌లను ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(ఏయూఎస్ఐబీ); మిగిలిన స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌లను ఏయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్(డీసీఎంఎస్) అందిస్తున్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి మూడేళ్ల వ్యవధి గల ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి.

ఎంసీఏ: ఏయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో 66 సీట్లు ఉన్నాయి.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో బీసీఏ/బ్యాచిలర్ డిగ్రీ ఇన్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులు; మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా ఇంటర్‌తోపాటు బీఎస్సీ/బీకాం/బీఏ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **కౌన్సెలింగ్ ఫీజు:** రూ.600
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 17
- **కౌన్సెలింగ్ తేదీ:** ఆగస్టు 19
- **కౌన్సెలింగ్‌కు తీసుకురావాల్సిన పత్రాలు:** ఏపీ ఐసెట్ 2024 ర్యాంక్ కార్డ్; టీసీ; పదోతరగతి, ఇంటర్/డిప్లొమా, డిగ్రీ సర్టిఫికెట్లు, మార్కుల పత్రాలు; తొమ్మిదో తరగతి నుంచి డిగ్రీ వరకు స్టడీ సర్టిఫికెట్లు; కులం, వైకల్యం ధ్రువీకరణ పత్రాలు
- **వెబ్‌సైట్:** audoa.andhrauniversity.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/8tClgiXలో చదవండి.


దిక్సూచి

మహీంద్రా ఆలిండియా టాలెంట్ స్కాలర్‌షిప్

కే.సీ.మహీంద్రా ఎడ్యుకేషన్ ట్రస్ట్-'మహీంద్రా ఆలిండియా టాలెంట్ స్కాలర్‌షిప్'నకు దరఖాస్తులు కోరుతోంది. దీనిని జాబ్ ఓరియంటెడ్ పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు చేస్తున్న అభ్యర్థులకు ఆర్థిక సహకారం అందించేందుకు ఉద్దేశించారు. వచ్చిన దరఖాస్తులు పరిశీలించి షార్ట్ లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. బాలికలకు, అల్పాదాయ కుటుంబాల్లోని పిల్లలకు, దివ్యాంగులకు, సైనిక దళాల్లో పనిచేస్తున్నవారి పిల్లలకు ప్రాధాన్యమిస్తారు. మొత్తం 550 మందికి అవకాశం కల్పిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు ఏడాదికి రూ.10,000లు చొప్పున మూడేళ్లు స్కాలర్‌షిప్ అందిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన పాఠశాల/బోర్డు నుంచి పదోతరగతి/ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. ప్రస్తుతం ఏదేని పాలిటెక్నిక్ ఇన్‌స్టిట్యూట్‌లో డిప్లొమా మొదటి సంవత్సరంలో అడ్మిషన్ పొంది ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 21
- **వెబ్‌సైట్:** www.kcmet.org



ఖరీఫ్ కష్టమేనా?

- ఆదిలోనే నిరాశ
- అన్నదాతకు కలిసిరాని సీజన్
- ఎండుతున్న వరి నాట్లు
- కురవని వర్షాలు

గంట్యాడ, ఆగస్టు 13: వరిని నమ్ముకున్న రైతన్నలకు ఆది నుంచే కష్టాలు మొదలయ్యాయి. వరుణుడి జాడ లేక పంటపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. మొన్నటి వర్షాలకు వరి పంటపై గంపెడు ఆశలు పెట్టుకున్న రైతన్న మొహంలో అంతలోనే ఆవేదన కనిపిస్తోంది. 25 రోజులుగా కొన్ని ప్రాంతాల్లో చినుకు జాడ లేదు. గత నెల నుంచి కనీస స్థాయిలో వర్షం కురవకపోవడంతో ఇప్పటివరకూ వేసుకున్న నాట్లు ఎండిపోతున్నాయి. మరో వైపు నాట్లు పడని చోట వరి నారు ముదురుతోంది. వర్షాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ఖరీఫ్ సీజన్ మొదలైనప్పటి నుంచి జూన్ నెలలో పెద్దగా వర్షాలు కురవలేదు. జూలై నెలలో ఎక్కువ రోజులు వర్షాలు కురిసినా పంట సాగుకు అవసరమైన స్థాయిలో నీరు చేరలేదు. ప్రాజెక్టుల పరిధిలో మినహా వర్షాధార గ్రామాల్లో ఉన్న చెరువుల్లో కొద్దిపాటి నీరే చేరింది. ఆ వర్షాలకు కొన్నిచోట్ల రైతులు నాట్లు వేసుకున్నారు. నాట్లు వేసిన చోట ఎకరంకు సుమారు రూ.50 వేల వరకూ ఖర్చు అయ్యింది. మరికొన్ని చోట్ల నాట్లు వేసుకోవడానికి నీరు చాలకపోవడంతో నేటికీ అవి బీడుభూములుగా దర్శనమిస్తున్నాయి. నాట్లు వేసిన చోట ఎండిపోతున్న వరిని రక్షించుకోవడానికి చెరువుల్లో ఉన్న కాస్త నీటిని ఆయిల్ ఇంజన్లతో తోడుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 90,058 హెక్టార్లలో వరి విస్తీర్ణం కాగా ఇప్పటి వరకూ 43,312 హెక్టార్లలో మాత్రమే నాట్లు వేసుకున్నట్లు అధికార లెక్కలు చెబుతున్నాయి. గత 25 రోజుల నుంచి వర్షాలు కురవకపోవడం.. ఎండలు తీవ్రంగా ఉండటంతో నాట్లు వేసిన పొలాల్లో భూములు నెర్రెలు ఇస్తున్నాయి. మరోవైపు వరి నారు వేసుకుని నెల రోజులు కావస్తున్నా నీరు లేక నాట్లు వేసుకోలేని దుస్థితిలో మరికొందరు ఉన్నారు.

మొదట్లోనే పంట ఎండిపోతోంది

చెరువుల్లో ఉన్న నీటిని తోడించి నాట్లు వేసుకున్నాం. ఊబాలు వేసేందుకు ఎకరం వద్ద సుమారు రూ.50 వేలు ఖర్చు పెట్టాం. గత 25 రోజులు నుంచి వర్షాలు లేక పంట ఎండిపోతోంది. నాట్లు వేసుకున్న పొలాల్లో నెర్రెలు కనిపిస్తున్నాయి. మొదట్లోనే పంట ఎండిపోతే రానున్న రోజుల్లో పంటకు నీరు ఉంటడం చాలా కష్టం.

- బి.అప్పలనాయుడు, చంద్రంపేట రైతు

ఆందోళన చెందాల్సిన పనిలేదు

వర్షాలు ఒకటి రెండు రోజుల్లో కురిసే అవకాశాలు ఉన్నాయి. రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదు. నెలాఖరు వరకూ నాట్లు వేసుకోవడానికి అవకాశం ఉంది. అప్పటికీ వర్షాలు కురవకపోతే ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తాం.

- టి.రామారావు, జేడీ, వ్యవసాయశాఖ

మహిళా పోలీసుల బాధ్యత కీలకం

రాజాం రూరల్: గ్రామస్థాయిలో శాంతిభద్రతల పరిరక్షణలో మహిళా పోలీసులు కీలకంగా వ్యవహరించాలని రాజాం టౌన్ సీఐ దాడి మోహనరావు స్పష్టం చేశారు. దీంతో పాటు గ్రామస్థాయిలో అసాంఘిక శక్తులకు సంబంధించిన సమాచారం, వివాదాలకు ఆస్కారం కలిగించే వ్యక్తుల వివరాలతో పాటు కొత్తవ్యక్తుల కదలికల వివరాలను పోలీస్‌స్టేషన్‌కు సమా చారం అందజేయడం వంటి బాధ్యతలున్నాయని ఆయన గుర్తు చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల పోలీసులతో టౌన్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. నిర్దేశించిన కేంద్రాల్లో సమర్థంగా విధులు నిర్వహించాలని సూచించారు.

'సుప్రీం తీర్పు రాజ్యాంగ విరుద్ధం'

వేపాడ: రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ ఆగస్టు 15న బ్లాక్‌డేగా ప్రకటిస్తూ మండల కేంద్రం వేపాడలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్టు మండల మాల మహానాడు అధ్యక్షుడు దేబారిక కిరణ్ తెలిపారు. ఈ మేరకు స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశ అత్యున్నత న్యాయస్థానం రిజర్వేషన్ల వర్గీకరణపై రాజ్యాంగ విరుద్ధంగా తీర్పునివ్వడం దారుణమన్నారు. దళిత కూలీ రైతు సంఘ నాయకులు కొరుపోలు గంగరాజు, దేబార్కి రవి, కడారి అప్పారావు, పార్థిన సోమునాయుడు, చెలికాని బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

బోర్లకు మరమ్మతులు

రేగిడి: సంకిలి, చిన్నయ్యపేట గ్రామాల్లో పాడైన బోర్లకు మంగళవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మరమ్మతులు చేశారు. సర్పంచ్ బి.పట్టాభి, పంచాయితీ కార్యదర్శి శైలజ పర్యవేక్షించారు. వీధి దీపాల సమస్యను తొలగించేందుకు మూడు గ్రామాల్లో ఎల్‌ఈడీ లైట్లు వేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు.

ఎంపీని కలిసిన టీడీపీ నాయకులు

వంగర: విజయనగం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడును మండల టీడీపీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో చిరకాలంగా పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించాలని కోరారు. వీటిని సీఎంకి వివరిస్తానని కలిశెట్టి తెలిపారు. బి.రాంబాబు, త్రినాథ, శ్రీను తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో మొక్కలు నాటాలి

రాజాం: పాఠశాలల ఆవరణల్లో విధిగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని ఎంఈవో పి.ప్రవీణ్ కుమార్ తెలిపారు. మంగళవారం రాజాం పర్యావరణ పరిరక్షణ సమితి వారు అందజేసిన మొక్కలను ఇల్లంనాయుడు వలస పాఠశాల ఆవరణలో నాటారు. వీటి విషయంలో ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

పాఠశాలలో దంత వైద్య పరీక్షలు

రాజాం రూరల్: పెనుబాక ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన దంత వైద్యశిబిరంలో 128 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వ హించారు. వికాస తరంగిణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దంత వైద్య నిపుణులు బంకి లావణ్య, సంస్థ ఆర్గనైజింగ్ కార్యదర్శి టీటీవీ రమణమూర్తి, ఎంఈవో ప్రవీణ్ కుమార్, హెచ్.ఎం. మహేశ్వరరావు, ఉపాధ్యాయులు మధుసూదనరావు, శ్రీలక్ష్మి, కామేశ్వరమ్మ, శారద, శ్రీదేవి, తులసి, చీడి జగన్నాథం పాల్గొన్నారు.

చెత్త సంపద తయారీ కేంద్రం పరిశీలన

బొబ్బిలి రూరల్: పారాది గ్రామంలో మంగళవారం ఎంపీడీవో రవికుమార్ ఆధ్వర్యంలో రెండో రోజు సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. శంకరరావు తదితరులు పాల్గొన్నారు.


వైసీపీ పాలనలో భూములు అన్యాక్రాంతం

రాజాం: వైసీపీ పాలనలో సీఐడీ ఆధీనంలో ఉన్న భూములను దొడ్డిదారిలో మాజీ మంత్రి జోగి రమేష్ కొడుకు పేరు మీద రిజిస్ట్రేషన్ చేసి, తరువాత వాటిని అమ్ముకొని బీసీలకు అన్యాయం చేశారని విజయనగరం పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు గురవాన నారాయణరావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు వంగా వెంకటరావు తీవ్రంగా విమర్శించారు. మంగళవారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో బీసీ నాయకులు మాట్లాడారు. బీసీలపై ఏమైనా దాడులు జరిగిన సందర్భాలు అంటూ ఉంటే అవి వైసీపీ హయాంలోనే జరిగాయన్నారు. బీసీ నాయకులు బొద్దూరు ఎంపీటీసీ వల్లూరు గణేష్, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ బీసీ సాధికార కమిటీ సభ్యులు జిల్లా అధ్యక్షుడు ముగడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో నూతన కోర్సులు

విజయనగరం టౌన్: యువతలో నైపుణ్యాలను మెరుగుపరిచి వారికి ఉపాధిని ఇచ్చే మెరుగైన కోర్సులను అందించేందుకు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఈ ఏడాది నుంచి నూతన కోర్సులు ప్రవేశపెడుతున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఆశారమణి, కో-ఆర్డినేటర్ ఎస్ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల్లో ప్రవేశం పొందడానికి యువతీ, యువకులు ఐటీఐ, ఇంటర్, బీటెక్, ఇతర ఉన్నత విద్యార్హతలు కలిగి ఉండాలని వారు తెలిపారు.

రాష్ట్ర బ్యాడ్మింటన్ పోటీలకు ధర్మవరం విద్యార్థిని



శృంగవరపుకోట రూరల్: శృంగవరపుకోట మండలం ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కాత్యాయని రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ పొట్నూరు శ్రీరాములు, రెడ్డి కృష్ణ తెలిపారు. ఈ నెల 16 నుంచి 19 వరకు విజయనగరం డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో జరగనున్న ఈ పోటీల్లో జిల్లా జట్టుకు ఈమె ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు.

ఇసుక విక్రయ కేంద్రం పరిశీలన



ఇసుక పాయింట్ దగ్గర హెచ్చరిస్తున్న తహసీల్దారు

బొబ్బిలి: బొబ్బిలి ఏపీఐఐసీ గ్రోత్‌సెంటరులో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఇసుక విక్రయ కేంద్రంలో గందరగోళం నెలకొంటోంది. ఈ కేంద్రం ప్రారంభించి 20 రోజులు కావస్తున్నప్పటికీ ఇంతవరకు అక్కడ తూనిక యంత్రాన్ని, సీసీ కెమే రాలను అమర్చకపోవడం పట్ల ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంచనాగా ఇసు కను కొలిచి అమ్ముతుండడం గమనార్హం. ఇక్కడ ఇసుక పంపిణీ విధానంలో వెల్లువెత్తుతున్న ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం స్థానిక తహసీల్దారు ఎం.శ్రీను గ్రోత్‌సెంటరులో గల ఇసుక స్టాకుపాయింట్‌ను పరిశీలించారు. స్థానికేతరులు పెద్దసంఖ్యలో వాహనాలను ఇసుక కోసం తీసుకురావడాన్ని గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. వాహనాలను వెంటనే తీసుకుని వెనక్కి వెళ్లిపోవాలని లేకుంటే వాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. 20 టన్నుల పరిమితి పక్కాగా అమలు కావడం లేదని, దీనిపై ఎటువంటి లెక్కలు లేవని పలు వాహనాల డ్రైవర్లు తహసీల్దారు ముందు ఆరోపించారు. స్థానిక ఇసుక పాయింట్ నుంచి ఇకనుంచి ఇసుకను తీసుకెళ్లే వినియోగదారులు కచ్చితంగా తమకు సంబంధించిన అన్ని రకాల నిర్మాణ ఆధా రాలను చూపాలని ఆంక్షలు విధించారు. తొలుత నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన తరువాత జిల్లా ప్రజలకు ఇవ్వాలని సూచించామన్నారు. కలెక్టర్ నుంచి ప్రత్యేక అనుమతి తెచ్చుకున్న స్థానికేతరులకు ఇసుక ఇస్తామని తహసీల్దార్ శ్రీను తెలిపారు.

అన్న క్యాంటీన్లకు విరాళాలు



చెక్కును కలెక్టరు అంబేడ్కర్‌కి అందజేస్తున్న ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్, ఆగస్టు 13: ప్రభుత్వం ఈ నెల 15 నుంచి ప్రారంభించనున్న అన్న క్యాంటీన్లకు ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఆధ్వర్యంలో విజయనగరానికి చెందిన పలువురు రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖులు కలిసి రూ.5,48,253 రూపాయలు విలువగల చెక్కు లను అంబేడ్కర్‌కు మంగళవారం అందజేశారు. ఈ విరాళాలకు సంబంధించి ఎవరెవరు ఎంత విరాళం ఇచ్చింది? ఆమె చెక్కు నెంబర్లతో సహా విడుదల చేశారు.

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న రేషన్ డీలర్లు

రాజాం: స్థానిక రేషన్ డీలర్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం చేశారు. స్వీట్లు పంచి తమ ఆనందాన్ని పంచుకున్నారు. సీఎంతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రేషన్ డీలర్ల వ్యవస్థకు పూర్వవైభవం తెస్తామని ప్రకటన చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీలర్ల సంఘ అధ్యక్షుడు సామంతుల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌ల కొట్టివేతకు నిర్ణయం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాజాం రూరల్, ఆగస్టు 13: పట్టణంలోని మాధవబజార్‌లో కాలువలను ఆక్రమించి వాటిపై చేపట్టిన నిర్మాణాలను కొట్టివేయాలని రాజాం మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు నిర్ణ యించారు. కాలువలపై నిర్మాణాలవల్ల వాటిని శుభ్రం చేసే అవకాశం పారిశుధ్య సిబ్బందికి లేకపో వడం, తద్వారా కాలువల్లో చెత్త పేరుకుపోయి దోమల సంతతి పెరగడం, వ్యాధులు ప్రబలడం వంటి అంశాలను ప్రస్తావిస్తూ 'ఫుట్‌పాత్‌నూ వదల్లేదు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఇటీవల కథనం ప్రచురితమైన నేపథ్యంలో కమిషనర్ అప్పలనాయుడు పలుమార్లు మాధవబ జార్‌లో పర్యటించారు. పరిస్థితిని సమీక్షించారు. షాపుల యజమానులతో పలుమార్లు సమావేశమయ్యారు. పరస్పర అంగీకారంతో ఓ నిర్ణయానికొచ్చారు. షాపుల్లోకి వెళ్లేందుకు వీలుగా స్థలాన్ని విడచిపెట్టి మిగిలిన అక్రమ నిర్మాణాలను కొట్టివేయాలన్న కమిషనర్ ప్రతిపాదనకు యజమానులు అంగీకరించారు. దీంతో కాల్వలపై ఆక్రమణలు కొట్టివేసేందుకు మున్సిపల్ యంత్రాంగం సిద్ధమవుతోంది.

బాలికలు చట్టాలను వినియోగించుకోండి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి

రాజాం రూరల్: సమాజం లో బాలికలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల నుంచి బయటపడాల ని, చట్టాలను సక్రమంగా సద్విని యోగం చేసుకోవాలని మండల న్యాయసేవా సంఘ అధ్యక్షుడు, సీనియర్ న్యాయాధికారి వివేక్ ఆనంద్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురవాం కేజీబీవీ పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో వివిధ చట్టాలపై అవ గాహన కల్పించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల వివరాలను పాఠశాల ఎస్‌వో సావిత్రిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేష న్ ఉపాధ్యక్షులు జయదేవ్, టీడీపీ నాయకులు గురవాన నారాయణరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వెంటనే ప్రారంభించాలి

కలెక్టరేట్: జిల్లాలోని ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని, రోజుకు 195 ఇళ్లకు తక్కువ కాకుండా ప్రగతి చూపించాలని కలెక్టర్ కోరారు. గృహ నిర్మాణంపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఇంకా 11,191 ఇళ్ల నిర్మాణం నేటికీ ప్రారంభం కాలేదని, వీటి నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని చెప్పారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

● జిల్లాలోని గిరిజన గ్రామాల్లో విద్యుత్ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. బొబ్బిలి మండలం గోపాలనాయుడు పేట పంచాయితీ పరిధిలో సియోనువలస, చినఅక్కివలస, రామన్న దొరవలస, కృపావలస, దీవెన వలస గ్రామాల్లో 60 కుటుంబాలు, దత్తిరాజేరు మండలంలో 74 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయని కలెక్టరు తెలిపారు. ఆయా శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ● విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న మరుగునీటి, తాగునీటి సమస్య, విద్యుత్ తదితర అత్యవసర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. వందరోజుల ఏడాది ప్రణాళికలు తయారు చేసినప్పటికీ మున్సిపాల్టీ పరిధిలో అత్యవసరంగా చేపట్టవల్సిన కార్యక్రమాలు కొన్ని ఉంటాయని, వాటిని వెంటనే పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. కలెక్టరేట్‌లో స్థానిక శాసనసభ్యులు అదితి గజపతిరాజుతో, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాల్టీలో మొత్తం డ్రైనేజీ వ్యవస్థను అధ్యయనం చేసి ఎక్కడెక్కడ ఏ మేరకు మరమ్మతులు అవసరం ఉన్నదీ వ్యక్తిగతంగా తనిఖీ చేయాలన్నారు. అక్టోబరు 2 లోగా నగరంలో ఎక్కడా డ్రైనేజీ సమస్య లేకుండా పరిష్కరించాలన్నారు. నీటి ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒక్కసారి శుభ్రం చేయాలని సూచించారు.

సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న కోండ్రు మురళీమోహన్

రాజాం: మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ అంబేడ్కర్‌తో సమావేశం నిర్వహించిన అనంతరం శ్యాంపురం క్యాంపు కార్యాలయానికి చేరుకొని మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వ హించారు. నాలుగు మండలాలకు సంబంధించి పెండింగ్ పనులు సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలగనివ్వకుండా సకాలంలో ఎరువులు, పురుగులు మందులు అందేలా చూడాలని వ్యవసాయ శాఖ అధికారులను కోరారు. అనంతరం నియోజకవర్గ స్థాయి కూటమి నాయకులతో చర్చించారు. ● జిల్లా స్థాయి అధికారులు రాజాంలో ఉన్న ప్రధాన సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ కోరారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో అధికారులతో సమావేశమయ్యారు. వివిధ మండలాల్లోని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని కోండ్రు కోరారు. ప్రత్యేకంగా రాజాం పట్టణంలో ప్రధాన రహదారి పనులు సకాలంలో పూర్తి చేయాలని కోరారు. కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో 50 కుటుంబాల చేరిక



పార్టీలో చేరిన వారితో కొల్ల అప్పలనాయుడు

సంతకవిటి: రామారాయిపురం, షాలిపేట, చింతలపేట గ్రామానికి చెందిన 50 వైసీపీ కుటుంబాలు మంగళ వారం టీడీపీలో చేరాయి. టీడీపీ నాయకుడు కొల్ల అప్ప లనాయుడు ఆధ్వ ర్యంలో వీరంతా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో పైడి శ్రీని వాసరావు, రాజేంద్రప్రసాద్, ఎన్ని మొగ్గునాయుడు, దువ్వారపు త్రినాథరావు, శ్రీని వాసరావు, బంక సత్యన్నారాయణ, చింతాడ విష్ణుమూర్తి, సునీల్ కుమార్, యర పాటి రాజారావు, బూరవల్లి కన్నయ్య, అసిరయ్య, జ్యోతి, సూర శ్రీరాములు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గట్టి భాను, వల్లూరు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం



చిన్నకోడిశ పాఠశాలలో క్రీడా పోటీలు పరిశీలిస్తున్న ఎంఈవో

రేగిడి: పిల్లలకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని ఎంఈవో వరప్రసాదరావు ఉపాధ్యాయులకు దిశా నిర్దేశం చేశారు. చిన్నకోడిశ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హెచ్ఎం సీతారాం తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం



పంటలు ధ్వంసమైన దృశ్యం

వంగర: వీవీఆర్‌పేట, రాజులగుమ్మడలలో తిష్టవేసిన ఏనుగులు అనేక పంట లను నేలమట్టం చేశాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. అటవీ శాఖ అధికారులు వాటిని తరలించే ప్రయత్నం చేయకుండా.. కాపలా కాస్తున్నారని, దీని వల్ల భారీగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతు లకు న్యాయం చేయాలని మంగళవారం కలెక్టర్‌ను స్థానిక ఎమ్మెల్యే కోండ్రు కలిసి వివరించినట్లు తెలిపారు.

బొల్లినేని విద్యార్థుల ప్రతిభ



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: బీఎస్సీ పారామెడికల్ ఫలితాల్లో బొల్లినేని మెడిస్కిల్స్ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం విడుదల చేసిన ఈ ఫలితాల్లో ఆప్టోమెట్రీ విభాగంలో వి.చిన్మయి, ఇమేజింగ్ టెక్నాలజీ విభాగంలో పి.లీలా మాధవి రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకులు సాధించారన్నారు. అనస్తీషియా విభాగంలో వి.గీతిక రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు, పెర్ఫ్యూజన్ విభాగంలో ఎం.శ్రావ్యశ్రీ 5వ ర్యాంకు, డయాలసిస్ విభాగంలో వై.సుష్మ భానోజీ 5వ ర్యాంకు సాధించారన్నారు. అత్యుత్తమ బోధన, నిరంతర పర్యవేక్షణతో ఈ ఫలితాలు సాధించామని తెలిపారు. ఏటా తమ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించడం సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుతం ఈ ఏడాది కోర్సుల్లో ప్రవేశాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ సీహెచ్ లక్ష్మి పద్మజ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

లారీ, బైక్ ఢీ

● యువకుడి మృతి.. మరొకరి పరిస్థితి విషమం



కరుణ (ఫైల్)

గరివిడి, ఆగస్టు 13: గరివిడిలో ఫేకర్ పరిశ్రమ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డీఎఫ్ఎస్ కాలనీకి చెందిన కొండ్రు కరుణ(26) మృతి చెందాడు. మరో యువకుడు కింతాడ రేవంత్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం విజయనగరం ఆసుపత్రికి తరలించారు. దీనికి సంబంధించి గరివిడి ఎస్ఐ దామోదర రావు, స్థానికులు అందించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. డీఎఫ్ఎస్ కాలనీకి చెందిన కరుణ గరివిడిలో సెల్‌పాయింట్ నడుపుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం మిత్రులైన రేవంత్, నూకరాజుతో కలిసి బైక్‌పై డీఎఫ్ఎస్ కాలనీ నుంచి గరివిడి వస్తున్నాడు. ఈ క్రమంలో ఫేకర్ పరిశ్రమ వద్దకు వచ్చేసరికి గరివిడి నుంచి డీఎఫ్ఎస్ కాలనీ వైపు వెళ్తున్న లారీని ఎదురుగా ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో కరుణ అక్కడికక్కడే మృతి చెందాడు. రేవంత్ తీవ్రంగా గాయపడగా, మరో యువకుడైన నాగరాజు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతుడి తల్లితండ్రులు నాగేశ్వరరావు, అప్పాయమ్మ గ్రామంలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు కాగా కరుణ రెండో వాడు. కుమారుడి మృతితో తల్లితండ్రులు విలపిస్తున్నారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గరివిడి ఎస్ఐ దామోదరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి కేసులో నిందితుల అరెస్టు



అదుపులోకి తీసుకున్న వారితో సీఐ శ్రీనివాస్

విజయనగరం క్రైం, ఆగస్టు 13: జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ ఆవరణలో ఈ నెల 8న అర్ధరాత్రి సమయంలో పెందుర్తికి చెందిన భార్యభర్తలపై దాడి చేసిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు వన్‌టౌన్ సీఐ ఎస్ శ్రీనివాస్ తెలిపారు. పెందుర్తి వెళ్లేందుకు రైల్వే స్టేషన్‌లో దిగి, వేరే ట్రైన్ లేనందున రైల్వే స్టేషన్ బయటకు వచ్చి టీ తాగి, వేచి ఉన్న సమయంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు అసభ్యంగా ప్రవర్తిస్తూ, అడ్డువచ్చిన భర్తని దారుణంగా కొట్టి హత్య చేసేందుకు ప్రయత్నించారు. దీనిపై బాధితులు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు దాడికి పాల్పడిన కోరాడ దండు (అలియాస్ దండు రాజు), బొగ్గు సూరి(అలియాస్ సూర్య)లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు. హత్యాయత్నానికి ఉపయోగించిన కర్రను, చాకును సీజ్ చేసినట్టు తెలిపారు.

మహిళ హత్య కేసులో భర్తకు రిమాండ్



పోలీసుల అదుపులో నిందితుడు దేముడు

శృంగవరపుకోట రూరల్, ఆగస్టు 13: భార్యమృతికి కారణమైన వ్యక్తిని శృంగవరపుకోట పోలీస్‌లు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. దీనికి సంబంధించి సీఐ వీఎస్‌మూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని మూలబొడ్డవర పంచాయతీ అమ్మపాలెం గ్రామానికి చెందిన దేవరపు దేముడుతో రమణమ్మకు కొంతకాలం క్రితం వివాహమైంది. వీరికి 12 సంవత్సరాల బాబు, 10 సంవత్సరాల పాప ఉంది. భార్యపై అనుమానంతో, దంపతుల మధ్య మనస్పర్థలు పెరిగి తరుచూ గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో ఈ నెల 11న రాత్రి 8గంటల సమయంలో ఇద్దరూ గొడవ పడ్డారు. కోపంతో రమణ చెక్కబద్ధతో భార్య తలపై బలంగా కొట్టాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన రమణమ్మ(35) స్పృహ కోల్పోయింది. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం విశాఖపట్టణం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 12న రాత్రి మృతి చెందింది. మృతురాలి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ వీఎస్‌మూర్తి కేసు నమోదు చేశారు. నిందుతుడిని కోర్టుకు తరలించారు.

నేరాల నియంత్రణపై దృష్టి పెట్టండి



రూరల్ సర్కిల్ ఎస్ఐలతో మాట్లాడుతున్న డీఎస్పీ

రాజాం రూరల్, ఆగస్టు 13: నేరాల నియంత్రణపై పోలీసులు దృష్టి పెట్టాలని చీపురుపల్లి డీఎస్పీ శ్రీనివాస చక్రవర్తి స్పష్టం చేశారు. ఇక్కడి రూరల్ సర్కిల్ కార్యాలయంలో రాజాం రూరల్, సంతకవిటి, రేగిడి ఎస్.ఐ.లతో రూరల్ సీఐ ఉపేంద్రతో కలిసి మంగళవారం ఆయన సమావేశమయ్యారు. శాంతిబద్రతల పరిరక్షణ, కేసులు, చార్జిషీట్లు తదితర అంశాలపై సమీక్ష జరిపారు. ఎస్.ఐ.లకు దిశ, నిర్దేశం చేశారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి: డీఈవో



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న డీఈవో పగడాలమ్మ

సీతానగరం: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో జి.పగడాలమ్మ సూచించారు. నిడగల్లు జడ్పీ ఉన్నత పాఠశాలను ఆమె మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులకు అకడమిక్ మోనటరింగ్‌పై సూచనలు చేశారు. రికార్డులను తనిఖీచేశారు. అన్ని తరగతులకు బోధన ఒకేలా ఉండాలని, పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని దిశా నిర్దేశం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీలించారు.

ఎమ్మెల్యేకి సహకరించాలి

గరుగుబిల్లి: కురుపాం నియోజకవర్గ పరిధిలోని ప్రధాన సమస్యలపై ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి స్పందించడం అభినందనీయమని అరకు తెలుగు దేశం పార్టీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఆయన చిలకాంలో విలేకరులతో మాట్లాడుతూ గత పదేళ్లలో మాజీ ఉప ముఖ్యమంత్రి పి.పుష్పశ్రీవాణి సమస్యలను పట్టించు కోలేదన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన రెండు నెలల సమయంలోనే సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రితో పాటు ఇతర శాఖల మంత్రులకు జగదీశ్వరి తెలియపర్చారన్నారు. కొంతమంది గిరిజనులకే ప్రాధాన్యం ఇస్తున్నారని, బీసీ వర్గాలను దూరం పెడుతున్నారని విమర్శలు గుప్పించడం మానుకోవాలని సూచించారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసే ఎమ్మెల్యేకు పార్టీ ప్రతినిధులు అండగా నిలవాలని కోరారు.

దశపర్ణితో అధిక దిగుబడులు



దశపర్ణి కషాయంపై అవగాహన కల్పిస్తున్న ఎన్ఎఫ్ఏ అన్నపూర్ణ

జియ్యమ్మవలస: ప్రస్తుత ఖరీఫ్‌లో అధిక దిగుబడులు సాధించేందుకు దశపర్ణి కషాయం ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రకృతి వ్యవసాయ అసోసియేట్ (ఎన్ఎఫ్ఎ) జి.అన్నపూర్ణ అన్నారు. మంగళవారం చింతల బెలగాంలో రైతులతో దశపర్ణి కషాయం తయారు చేయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి బి.ధనుంజయరావు, సిబ్బంది వై.కృష్ణ, ఎం.సింహాచలం, త్రినాథ్, రైతులు పార్వతి, తేజ, సరితలు పాల్గొన్నారు.

మామిడిపల్లి విద్యార్థుల ప్రతిభ



జీవవైవిధ్య షార్ట్ ఫిలింలో నటించిన బాలలు

సాలూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవ వైవిధ్య మండలి ఆధ్వర్యంలో పార్వతీపురం మన్యం జిల్లా స్థాయిలో మంగళవారం జరిగిన పోటీల్లో మామిడిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులు కైవసం చేసుకున్నారు. వక్తృత్వ పోటీల్లో గ్రీష్మకు ప్రథమ, షార్ట్ ఫిలిం పోటీల్లో గంగవంశం చరిష్మాకు రెండో బహుమతి లభించాయి. ఆ చిన్నారులను ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.

పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కల తొలగింపు



యంత్రంతో చెత్తను తొలగిస్తున్న దృశ్యం

వీరఘట్టం: మండలంలోని వీరఘట్టం బీసీకాలనీలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగించకపోడంతో పాములు సంచరిస్తున్నాయి. దీంతో విద్యార్థులు, సమీపంలో నివసిస్తున్న ప్రజలు భయాందోళనలు గురవుతున్నారు. ఇటీవల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా ఎంపికైన బండి సాగర్ తన సొంత నిధులతో యంత్రాన్ని ఏర్పాటు చేసి పాఠశాల ఆవరణలో తుప్పలను, చెత్తను తొలగించి శుభ్రం చేశారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్, చిన్న, సుమన్, బాబు పాల్గొన్నారు.

గ్రామాల్లో సంపద తయారీ కేంద్రాలు ఉండాలి



ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో రాంప్రసాద్

సీతంపేట రూరల్: ప్రతి గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఉండాలని డీఎల్‌పీవో కె.రాంప్రసాద్ అన్నారు. శిక్షణలో భాగంగా మంగళవారం సీతంపేట గ్రామంలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.గీతాంజలి, ఈఓపీఆర్‌డీ సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం పద్ధతిలో సాగుతో ఆదాయం



కూరగాయలను పరిశీలిస్తున్న ఏవో అనురాధ పండా

సాలూరు రూరల్: ప్రకృతి వ్యవసాయంలో ఏటీఎం పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరల సాగుతో రైతులకు అధిక ఆదాయం లభిస్తుందని వ్యవసాయాధికారి అనురాధ పండా సూచించారు. మరిపిల్లిలో మంగళవారం ఆమె ఏటీఎం పద్ధతి సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నురాని తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రిలో పొలంబడి

వీరఘట్టం: చలివేంద్రి గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త ఎస్.లక్ష్మీనారాయణ, ఏడీఏ కె.రత్నకుమారి, ఏఓ సౌజన్య రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో కృష్ణకాంత్, రైతులు పాల్గొన్నారు.

మధ్యవర్తుల ప్రమేయం వద్దు

- మంత్రి సంధ్యారాణి
- ప్రజా దర్బార్‌లో రెవెన్యూ అధికారులకు సూచన



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు: మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రజల భూ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాలూరులోని తన నివాసంలో ఆమె ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈసందర్భంగా నియోజకవర్గంతో పాటు వివిధ జిల్లాలకు చెందిన అధికారులు, ప్రజలు వివిధ సమస్యలపై వినతిపత్రాలు అందించారు. అనంతరం ఆమె మెంటాడ, పాచిపెంట మండలాల తహసీల్దారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులలో ప్రజల భూ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. పాచిపెంట మండలంలో కూడుమూరు భూ సమస్యకు సంబంధించి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అందరికీ న్యాయం జరిగేలా అధికారులు చూడాలన్నారు. మెంటాడ మండలంలో పోడు భూముల సమస్యలు పరిష్కరించాలని సూచించారు. రైతులకు అన్ని విధాలుగా మేలు జరిగేలా రెవెన్యూ అధికారులు పని చేయాలని ఆదేశించారు. తన ఇల్లు కొద్దిపాటి వర్షానికే కారిపోతోందని... తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని పాచిపెంట మండలం గుంటమామిడివలస గ్రామానికి చెందిన సంగిరెడ్డి గంగమ్మ వినతిపత్రం అందజేశారు. ప్రజాదర్బార్ కార్యక్రమానికి పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: అగ్రిగోల్డ్ బాధితులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి జోగి రమేష్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు అగ్రిగోల్డ్ భూములను ఆక్రమించుకున్నారని ఆయన ఆరోపించారు. అగ్రిగోల్డ్ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో టీడీపీ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో చర్యలు చేపట్టామని చెప్పారు. జోగి రమేష్ కుమారుడు జోగి రాజు, బాబాయ్ జోగి వెంకటేశ్వరరావు రికార్డులు, సర్వే నెంబర్ కూడా మార్చేశారని ఎమ్మెల్యే వివరించారు. జోగి రమేష్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలను ఉపయోగించాలి



సీతానగరం: శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

సీతానగరం: గ్రామ పంచాయతీల్లోని చెత్త సంపద కేంద్రాలను అభివృద్ధి చేసి గ్రామాల్లో పారిశుధ్యం తొలగించే చర్యలు చేపట్టడంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తడి, పొడి చెత్తలు తొలగించడంలో కీలక పాత్ర పోషిస్తున్న గ్రీన్ అంబాసిడర్ల గౌరవ వేతనాలు స్వచ్ఛభారత్ నుంచి నేరుగా ఇచ్చే విధంగా ప్రభుత్వం ఆలోచన చేస్తోందని తెలిపారు. పంచాయతీల అభివృద్ధి కోసం ఎన్డీఏ ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేస్తుందన్నారు. గ్రామాల్లో ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు సర్పంచ్‌లు, కార్యదర్శులు భాగస్వామ్యంతో ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఈశ్వరరావు, ఈవోపీఆర్‌డీ కేకే వర్మ, బలగ శ్రీరాములునాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆదేశించారు. భద్రగిరి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కమిటీ సమావేశంలో మంగళవారం పాల్గొన్నారు. ఆసుపత్రి అభివృద్ధి, భవన నిర్మాణాలు, మందుల కొరత తదితర అంశాలపై చర్చించారు. ప్రజలకు ఎంతో ఉపయోకరమైన భద్రగిరి ఆసుపత్రి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొని రావాలని సూచించారు. అనంతరం రోగులకు ఇస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. మెరుగైన ఆహారం అందించాలని ఏజెన్సీని ఆదేశించారు. ఈ సమావేశంలో వైద్యులు, ఆసుపత్రి కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఆసుపత్రి సిబ్బంది ఎమ్మెల్యేను దుశ్శాలువతో సత్కరించారు.

చేతిరాతపై పట్టు సాధించి..

- తోటి విద్యార్థులకు శిక్షణ ఇస్తూ ఆదర్శంగా నిలుస్తున్న నందిని
- నేడు కాలిగ్రఫీ దినోత్సవం



అతిథుల నుంచి బహుమతి స్వీకరిస్తున్న నందిని(ఫైల్)

సాలూరు రూరల్: చేతిరాతలో నైపుణ్యం సాధించిన ఆమె.. తోటి విద్యార్థులకు, అనాథ పిల్లలకు శిక్షణ ఇస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. ఆగస్టు రెండో బుధవారం ప్రపంచ కాలిగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆ విద్యార్థినిపై ప్రత్యేక కథనం. సాలూరు మున్సిపల్ కేఎస్ఎం గాడివీధి ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న కొల్లి నందిని చేతిరాత చూడముచ్చటగా ఉంటుంది. ఈ ప్రతిభను తండ్రి రామకృష్ణ గుర్తించి, తన బిడ్డ చేతిరాతలో మరింత నైపుణ్యం పొందేందుకు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇప్పించారు. దీంతో ఆ బాలిక చేతిరాతలో మరింత రాణించింది. కాలిగ్రఫీపై వివిధ సంస్థలు నిర్వహించే పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపింది. జాతీయ, రాష్ట్ర స్థాయి బహుమతులు కైవసం చేసుకుంది. తాను చదువుతున్న పాఠశాలలో ఏడు, ఎనిమిది తరగతి విద్యార్థులకు చేతిరాతపై శిక్షణ ఇస్తోంది. అలాగే నవజీవన్ అనాథ పిల్లల ఆశ్రమానికి సాయంత్రం వెళ్లి వారికి కూడా చేతిరాతపై శిక్షణనివ్వడం విశేషం. చేతిరాత బాగుంటే పరీక్షల్లో మంచి మార్కులు వస్తాయని, అందుకే అందరికీ చేతిరాత నేర్పుతున్నానని బాలిక చెప్పడం విశేషం.

రహదారి భద్రతపై అవగాహన అవసరం



రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పాలకొండ: రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన ఉండాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలుర)లో రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ హరగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నవీన్‌కుమార్ మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడిపితే మైనర్‌తో పాటు వాహన యజమానికి మూడు నెలల కఠిన కారాగారశిక్ష, రూ.5వేలు జరిమానా ఉంటుందన్నారు. వాహనాన్ని కూడా జప్తు చేస్తామన్నారు. వైద్యాధికారి నారాయణరావు మాట్లాడుతూ ప్రమాదాలు జరిగిన వెంటనే తీసుకోవాల్సిన ప్రాథమిక చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్య క్రమంలో ఏజీఎంవో పైల శంకరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెలమల అప్పారావు, జి.గోవిందరావు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఐసీడీఎస్, వెలుగు సిబ్బంది

సాలూరు రూరల్: చెడు వ్యసనాలకు విద్యార్థులు, యువత, దూరంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ పిలుపునిచ్చారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మామిడిపల్లిలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, వెలుగు సిబ్బంది, విద్యార్థులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పిల్లల ప్రవర్తన, అలవాట్లపై తల్లిదండ్రులు కన్నేసి ఉంచాలని సూచించారు.

పాఠశాలల బస్సులకు ధ్రువపత్రాలు తప్పనిసరి

సాలూరు: ప్రైవేటు పాఠశాలల బస్సులు అన్ని రకాల అనుమతులు, ధ్రువపత్రాలను కలిగి ఉండాలని సాలూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జేవీఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని వివిధ పాఠశాలల బస్సుల ఫిట్‌నెస్‌తో పాటు వివిధ రకాల అనుమతులు పత్రాలను కలిగి ఉన్నాయా? లేదా అనే విషయాలను మంగళవారం ఆయన పరిశీలించారు. అన్ని రకాల ధ్రువపత్రాలు, అనుమతులు లేకుండా బస్సులు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆకట్టుకున్న మాక్‌డ్రిల్



మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న వివిధ పోలీసు శాఖ దళాలు

పార్వతీపురంటౌన్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పోలీసు పరేడుకు సంబంధించి మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. డీఎస్పీ అప్పారావు ఆధ్వర్యంలో పోలీసుశాఖకు చెందిన వివిధ దళాలు మాక్‌డ్రిల్‌లో పాల్గొన్నాయి. పోలీసుశాఖ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమవుతోంది.

ప్రతిఒక్కరిలో జాతీయ భావం ఉండాలి

పార్వతీపురంటౌన్: ప్రతిఒక్కరిలో జాతీయ సమైక్యత భావం ఉండాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు అన్నారు. హర్‌ఘర్.. తిరంగ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలో మంగళవారం పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ప్రతిఒక్కరిలో జాతీయ భావం ఉండాలన్నారు.

కందులపథంలో వైద్యశిబిరం

సాలూరు రూరల్: కందులపథంలో మామిడిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి శివకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. నలుగురు గర్భిణులతో సహా 24 మందికి వైద్య సేవలందించారు. ఆరోగ్యం కాపాడుకునే విషయమై అవగాహన కల్పించారు.

భారీ వర్షంతో ఊరట



రావివలసలో రహదారిపై చేరిన వర్షపు నీరు

గరుగుబిల్లి: మండలంలో మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో ఊరట లభించింది. గత కొద్ది రోజులుగా వేసవిని తలపించేలా ఎండలు కాస్తుండటంతో ఉక్కిరిబిక్కిరైన పరిస్థితులు నెలకొన్నాయి. అలాగే వర్షాలు లేక వరి ఎదలతో పాటు వరి ఉబాలు చేపట్టిన పంట పొలాలు ఎండిన పరిస్థితి నెలకొంది. వర్షం కురవడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతుంది. ఇదిలాఉండగా భారీ వర్షం కారణంగా రావివలసలోని ప్రధాన వీధులు జలమయమయ్యాయి. రహదారిపై నీరు నిలబడటంతో రాకపోకలకు కొంతమేర అంతరాయం నెలకొంది.

పారిశుధ్య సిబ్బందిపై వివక్ష తగదు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: కార్మిక సంక్షేమం, రాష్ట్ర ప్రభుత్వ వైద్య సంస్థల్లో పనిచేస్తున్న పారిశుధ్య, భద్రత, చెదపురుగు నివారణా సిబ్బందిపై వివక్షను ఆపాలని ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లాల కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఆధ్వర్యంలో పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ చంద్రకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏరియా ఆసుపత్రులు, సామాజిక ఆసుపత్రులు కలిపి 222 మంది కార్మికులు ఉన్నారని, వీరు టీవీటీ గ్రూప్ ఏజెన్సీలో పనిచేస్తున్నారని తెలిపారు. వీరిపై ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల అరాచకాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. మూడు నెలలు ఒకసారి కూడా జీతాలు చెల్లించడం లేదని చెప్పారు. రాష్ట్రంలోని మున్సిపల్ కార్మికుల మాదిరిగానే ఈ వైద్య శాలలో కూడా దళారీ వ్యవస్థను నిర్మూ లించి ప్రత్యేక సంస్థ ద్వారా ప్రతి నెలా రూ.26 వేలు కనీస వేతనం పెంపుదల చేసి వేలాది మంది సిబ్బందికి చెల్లించే ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సింహాద్రి, దుర్గారావు, అలజంగి కుమారమ్మ, ఎం.చంద్ర మౌళి, కావ్య, సుధీర్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

నేడు అన్న క్యాంటీన్‌కు భూమి పూజ

సాలూరు: స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో బుధవారం అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి భూమి పూజ నిర్వహించనున్నట్టు టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు.

ఒంటరి మహిళకు ఆర్థిక సాయం

గుమ్మలక్ష్మీపురం: ఇటీవల తన భర్తను కోల్పోయిన ఓ నిరుపేద మహిళకు హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ చేయూతనిచ్చింది. గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన పాల్తేరు లక్ష్మి భర్త వరప్రసాదరావు ఇటీవల మృతిచెందారు. దీంతో హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ముందుకొచ్చి విరాళాల రూపంలో రూ.25వేలు సేకరించింది. ఈ మొత్తాన్ని సర్పంచ్ బి.గౌరీశంకరరావు ఆధ్వర్యంలో మంగళవారం ఆమెకు అందజేశారు.

సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

గుమ్మలక్ష్మీపురం: భద్రగిరి ఏపీ గిరిజన గురుకుల బాలికల కళాశాలలో (పీటీజీ) సీట్ల సంఖ్య పెరిగిన మేరకు అర్హులైన అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ ఎ.సత్యవతి తెలిపారు. ఒక్కొక్క గ్రూప్‌నకు పది చొప్పున సీట్లు పెరిగిన మేరకు బైపీసీలో 10 సీట్లు, ఎంపీసీలో ఏడు, హెచ్ఈసీలో ఐదు సీట్లు చొప్పున భర్తీ అయ్యాయని తెలిపారు. మిగతా సీట్లను పార్వతీపురం ఐటీడీఏ అధికారుల ఆదేశాలు మేరకు భర్తీ చేస్తామని ప్రిన్సిపాల్ సత్యవతి తెలిపారు.

గురుకుల కళాశాలలో..

సీతంపేట రూరల్: స్థానిక ఏపీఆర్ గురుకుల కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించి మంగళవారం మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహించారు. గిరిజన సంక్షేమ ఉపసంచాలకులు అన్నదొర ఆధ్వర్యంలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ గ్రూప్‌లలో మొత్తంగా 30 సీట్లకు కౌన్సెలింగ్ చేపట్టారు. 28 సీట్లు భర్తీ అయినట్లు డీడీ అన్నదొర తెలిపారు. ఈ కౌన్సెలింగ్‌లో ప్రిన్సిపాల్ సూర్యకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యం

గరుగుబిల్లి: పంచాయతీల పరిధిలో మౌలిక వసతుల కల్పనకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీవో పి.సూర్యనారాయణ, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు సూచించారు. మంగళవారం మండల అభివృద్ధి కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ పంచాయతీలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు కృషి చేయాలన్నారు. రిసోర్స్‌పర్సన్లుగా టి.భాస్కరరావు, అప్పారావు వ్యవహరించారు.

రాయితీపై పరికరాలు

గరుగుబిల్లి: గ్రామాల్లోని రైతులకు రాయితీపై అవసరమైన పరికరాలు మంజూరు చేయనున్నట్టు ఉద్యానశాఖ అధికారిణి అమరీశ్వరి తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన, ఇతర పంటలు సాగు చేసే వారికి డ్రిప్, స్ప్రింక్లర్లు, పైపులు రాయితీపై అందించనున్నట్టు తెలిపారు. రైతుసేవా కేంద్రాల్లో రైతుల వివరాలు అందించాలని కోరారు. కాయగూరలు, పూలు సాగు చేస్తున్న రైతులు వివరాలు అందిస్తే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు సంబంధించి మొత్తాలు జమ చేస్తామని చెప్పారు. ఏమైనా సందేహాలు ఉంటే 7995009843, 7995009841 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

సారా, బెల్లం ఊటలు ధ్వంసం

సాలూరు రూరల్: ఏవోబీలో డెన్సరాయి, రూఢి కొండల్లో సారా తయారీ కేంద్రంపై మంగళవారం రూరల్ ఎస్.ఐ ఎం.వెంకటరమణ తన సిబ్బందితో కలసి దాడి చేశారు. పోలీసుల రాకను పసిగట్టిన తయారీదారులు పరారయ్యారు. సారా తయారీకి నిల్వ ఉంచిన 6000 లీటర్ల పులిసిన బెల్లం ఊటను, కొద్దిపాటి సారాను పోలీసులు ధ్వంసం చేశారు. మరో 120 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. తయారీదారులను గుర్తించి కేసు నమోదు చేస్తామని ఎస్.ఐ. వెంకటరమణ తెలిపారు.

సారా విక్రయదారుల అరెస్టు

కొమరాడ: మండలంలోని తులసివలస సమీపంలో సారా విక్రయిస్తున్న ఇద్దరిని మంగళవారం అరెస్టు చేసినట్టు కొమరాడ ఎస్ఐ నీలకంఠం తెలిపారు. తులసివలస గ్రామానికి చెందిన గన్నెల ఎర్రయ్య దీసరి కృష్ణ గ్రామానికి సమీపంలో సారా విక్రయిస్తుండగా పట్టుబడ్డారని చెప్పారు. కేసు నమోదు చేసి, అరెస్టు చేశామన్నారు. 20 లీటర్ల సారా క్యాన్‌ను సీజ్ చేశామని చెప్పారు.

దొంగ హల్‌చల్

పార్వతీపురం టౌన్: పట్టణంలోని కొత్తవలస నందమూరి కాలనీలో మద్యం మత్తులో ఉన్న ఓ దొంగ హల్‌చల్ చేశాడు. మంగళవారం ఉదయం నందమూరి కాలనీలో ఓ యువకుడు మద్యం మత్తులో మున్సిపల్ పాఠశాల హెచ్ఎం గవర్నదొర బైకును దొంగిలిస్తుండగా కాలనీవాసులు పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ రవీంద్రరాజు, పోలీసులు మద్యం మత్తులో ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై ఎస్ఐని వివరణ కోరగా మద్యం మత్తులో ఉండడం వల్ల ఆ వ్యక్తి నుంచి వివరాలు సేకరించడం లేదని, స్థానికులు, హెచ్ఎం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.